
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 సిద్దిపేట
ఆదివారం 20 అక్టోబరు 2024





ఒకప్పటి విక్టరీ టాకీస్

కొత్తపల్లి టు హుస్నాబాద్ రహదారికి మహర్దశ

- నాలుగు వరుసలుగా విస్తరించేందుకు రూ.77.20 కోట్లు మంజూరు



హుస్నాబాద్ నుంచి కొత్తపల్లి రహదారి

హుస్నాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ జిల్లా కొత్తపల్లి రాజీవ్ రహదారి నుంచి హుస్నాబాద్ వరకు నాలుగు వరుసల రోడ్డు విస్తరణకు అడుగులు పడ్డాయి. మొదటి విడతగా ఎండీఆర్ ప్లాన్ ద్వారా ప్యాకేజీ -2లో రూ.77.20 కోట్లు మంజూరు చేస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గంలో ప్రధాన రహదారిగా ఉన్న ఈ రోడ్డు అభివృద్ధి కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజల కల నెరవేరింది. ఇందుకు కృషి చేసిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, నాయకులు చిత్తారి రవీందర్, కౌన్సిలర్లు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరు నెలల క్రితం కొత్తపల్లి టూ హుస్నాబాద్ నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనులపై ఓ కన్సల్టెన్సీ సంస్థతో సర్వే చేయించారు. కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తా వరకు 21 కిలోమీటర్ల ఫోర్ లేన్ రోడ్డు నిర్మాణానికి రూ.163 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయించి ప్రభుత్వానికి పంపించారు. మొదటి విడతలో 11 కిలోమీటర్లకు రూ.77.20 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. మిగతా 10 కిలోమీటర్లు రెండో విడతగా మంజూరు చేయనున్నారు. పస్తుతం కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు 60 ఫీట్ల రోడ్డు ఉంది. దీనిని 100 ఫీట్ల రహదారి చేయనున్నారు. హుస్నాబాద్ నుంచి జనగామ వరకు కూడా ఫోర్ లేన్ రోడ్డు నిర్మాణంపై ఆశలు చిగురిస్తున్నాయి. గత ప్రభుత్వం దీనిని స్టేట్ హైవే కింద తీసుకొని నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ప్రతిపాదనలకే పరిమితమైంది. ఇదే కాకుండా కేంద్ర ప్రభుత్వం భారత్ మాల పథకం కింద జాతీయ రహదారి నిర్మాణానికి ప్రతిపాదన చేశారు. ఇది కూడ కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకుని దీని నిర్మాణం కూడా చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీని నిర్మాణం జరిగితే రవాణా పరంగా అనేక ప్రయాజనాలు కలుగనున్నాయి.

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు : మంత్రి పొన్నం ప్రభాకర్

కొత్లపల్లి నుంచి హుస్నాబాద్ నాలుగు లేన్ల రోడ్డు విస్తరణకు మొదటి విడతగా రూ.77.20 కోట్లు మంజూరు చేయడం పట్ల రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మిగతా పనులకు త్వరలో నిధులు మంజూరవుతాయని వెల్లడించారు. ఈ పనులతో హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలతో పాటు మిగతా ప్రయాణికులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు.

అన్ని పంటలకు బోనస్ ఏమైంది?

- రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హరీశ్‌రావు

సిద్ధిపేట కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి, నేడు కేవలం సన్న వడ్లకు మాత్రమే ఇస్తానంటుందని ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. శనివారం సిద్దిపేటలోని మార్కెట్‌యార్డ్‌లో ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అన్ని పంటలకు అని చెప్పి, గెలిచిన తర్వాత సన్న రకానికి మాత్రమే బోనస్ ఇస్తామని మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

సండేస్పెషల్

ఒకప్పుడు వినోదం అంటే సినిమా.. థియేటర్‌లో కొత్త సినిమా పడిందంటే పట్టణానికి పండుగ వచ్చినంత సందడి. టాకీసుల ముందు అభిమానుల కోలాహలం అంతాఇంత కాదు. అభిమాన కథానాయకుడిని వెండితెరపై మొదటి షోనే చూసేందుకు గేట్ల ముందు పడిగాపులు కాసేవారు. భారీ కటౌట్లు.. టికెట్ల కోసం ఇక్కట్లు.. హౌస్‌ఫుల్ బోర్డులు కనిపించేవి. ఇక సినిమా వందరోజులాడితే అభిమానుల పూనకాలతో హోరెత్తేది. థియేటర్ ఓనర్లకు జేబు నిండా డబ్బులు వచ్చిపడేవి. కానీ ఇదంతా గతం. ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. వెండి'తెర' మసకబారుతోంది. మెట్రో నగరాలు, మల్టీప్లెక్స్‌లు మినహాయిస్తే పట్టణాల్లో థియేటర్ల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రేక్షకులు లేక రోజుకు నాలుగు ఆటలు కూడా సరిగ్గా ఆడటం లేదు.

- సిద్ధిపేట కల్చరల్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి)

'తెర'మరుగు

థియేటర్ల పరిస్థితి దయనీయం

- ఒకప్పుడు సినిమా విడుదలైతే జాతరే
- ఇప్పుడు అంతగా ఆసక్తి చూపని ప్రేక్షకులు
- పెద్ద హీరో సినిమాలకు మాత్రమే కాస్త సందడి
- సిద్దిపేటలో మూడు థియేటర్లు



ప్రస్తుతం మూతపడిన శ్రీసీతారామంజనేయ కళామందిర్

70 ఏళ్ల క్రితం సిద్దిపేట పట్టణంలో మొట్టమొదటి సినిమా థియేటర్ విక్టరీ టాకీస్. స్వాతంత్ర్యం రాకముందు నుంచే సిద్దిపేటలో విక్టరీ టాకీస్ ఏర్పాటు చేశారని, పార్శీలు నిర్మించి విక్టరీ అని పేరు పెట్టారని కొంతమంది సీనియర్ సిటిజన్లు చెబుతున్నారు. ప్రస్తుతం విక్టరీ టాకీస్ మూతపడింది. పట్టణంలో విక్టరీ చౌరస్తాగా పిలవబడుతున్న సర్కిల్ ఈ థియేటర్ పేరుమీదనే వచ్చింది. సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్ నుంచి మెదక్ వెళ్లే రోడ్డులో ఉండేది. మూకీ మూవీస్ దగ్గర నుంచి కలర్ సినిమాల వరకు నాన్‌స్టాఫ్‌గా సిద్దిపేట పట్టణ, పరిసర గ్రామాల ప్రజలను రంజింప చేసింది ఈ టాకీస్. పాతిక ఏళ్ల తర్వాత కరీంనగర్ దారిలో బాలాజీ థియేటర్ అందుబాటులోకి వచ్చింది. ఈ రెండు టాకీస్‌ల్లో అర్ధ రూపాయి, రూపాయికి కూడా టికెట్లు చిరిగాయి. అప్పటి అగ్ర కథానాయకులు ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, కృష్ణంరాజు, శోభన్ బాబు, మురళీమోహన్, చంద్రమోహన్ సినిమాలు సిద్దిపేట థియేటర్లకు వస్తే టాకీస్‌ల్లోని బెంచీలు, కుర్చీలు నిండేవి. ఇక జానపద, పౌరాణిక చిత్రాలు వస్తే ఎక్కువగా పల్లెటూర్ల నుంచి ఎడ్లబండ్లల్లో గుంపులుగా వచ్చేవారు. టాకీస్ ఆవరణలో బండిని నిలిపి, ఎడ్లను కట్టేసి సినిమా చూడటానికి వెళ్లేవారు. మరికొంత మంది కిలోమీటర్ల దూరం నుంచి సినిమా చూసేవారు. ఆ తర్వాత శ్రీవెంకటేశ్వర, శ్రీనివాస, శ్రీసీతారామంజనేయ థియేటర్లు అందుబాటులోకి వచ్చాయి. కాలానుగుణంగా రీల్స్ వేసి బొమ్మ వేసే

(తరువాయి 8వ పేజీలో)



సుడా కార్యాలయం

ఇవీ ప్రయోజనాలు

- అభివృద్ధి పనుల మంజూరు కోసం ప్రభుత్వ అనుమతులు వచ్చేవరకు అవసరం లేకుండా సుడా ఛైర్మన్, వైస్ ఛైర్మన్ తీర్మానం చేస్తే సరిపోతుంది.
- గ్రామాలు, పట్టణాల్లో రహదారులు, సెంట్రల్ లైటింగ్, పార్కులు, ఓపెన్ జిమ్‌లు, డివైడర్ల ఏర్పాటు, కల్వర్టులు, వంతెనల నిర్మాణం చేపట్టడానికి నిధులు ఖర్చు చేసే అవకాశం
- ఇష్టారాజ్యంగా రియల్ ఎస్టేట్ వెంచర్లు ఏర్పాటు చేయకుండా సుడా నిబంధనల ప్రకారం లేఅవుట్లను అభివృద్ధి చేయొచ్చు. ఇంటి అనుమతుల ప్రక్రియ సులభతరం అవుతుంది. ఆదాయం కూడా పెరుగుతుంది.
- మున్సిపాలిటీలు, గ్రామాల పాలకవర్గాలకు అనుసంధానంగా పని చేయనున్నది.
- సుడాకు నేరుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు మంజూరవుతాయి.
- అన్ని నిర్ణయాలు తీసుకోగలిగే స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థగా ఉంటుంది.

జిల్లా మొత్తం సుడా

- విస్తరణ దిశగా సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ
- సుడా పరిధిలోకి జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాలు
- ప్రతిపాదనలు పంపిన కలెక్టర్.. త్వరలోనే గ్రీన్‌సిగ్నల్
- నిధుల సమీకరణ.. ఆదాయం పెంపు కోసం కసరత్తు
- సుడా పదవులపై జిల్లాలోని కాంగ్రెస్ కీలక నేతల కన్ను

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, అక్టోబరు 19 : సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా)ని జిల్లా అంతటా విస్తరించడానికి కసరత్తు మొదలైంది. ప్రస్తుతం సిద్దిపేట పట్టణంతోపాటు చుట్టుపక్కల ఉన్న 26 గ్రామాలు మాత్రమే సుడా పరిధిలో ఉన్నాయి. కాగా దీని పరిధిని జిల్లా వ్యాప్తంగా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కలెక్టర్ మనూచౌదరి సైతం ఇటీవలే ప్రతిపాదనలు పంపించారు. త్వరలోనే సర్కారు నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇకపై జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలు సుడా పరిధిలోనే ఉండబోతున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిధులను అధికంగా సేకరించి అభివృద్ధిని సాధించడమే తాజా పరిణామాలకు కారణం. ఇదిలా ఉంటే సుడా ఛైర్మన్, డైరెక్టర్ల పదవులకు ఇక పోటీ పెరగనున్నది.

2017వ సంవత్సరంలో ఏర్పాటైన సుడాకు 2018 ఏప్రిల్‌లో 14 మందితో పాలకవర్గాన్ని నియమించారు. ఈ కమిటీకి ఛైర్మన్‌గా మారెడ్డి రవీందర్‌రెడ్డి సుదీర్ఘకాలం కొనసాగారు. వైస్ ఛైర్మన్‌గా సిద్దిపేట మున్సిపల్ కమిషనర్, సభ్యులుగా స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, కౌన్సిలర్లతోపాటు నామినేటెడ్ అయిన డైరెక్టర్లు ఉంటారు. ఆనాడు సిద్దిపేట మున్సిపాలిటీతోపాటు 26 గ్రామాలను సుడా పరిధిలో చేర్చారు. సిద్దిపేటకు 10 కిలోమీటర్ల లోపు విస్తరించి ఉన్న సిద్దిపేట అర్బన్ మండలంలోని 11 గ్రామాలు, రూరల్ మండలం నుండి 9 గ్రామాలు, చిన్నకోడూరు, కొండపాక మండలాల్లోని 6 గ్రామాలు మాత్రమే ఈ పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో ఉన్నాయి. ప్రస్తుతం ఈ సంఖ్య 514 గ్రామాలకు, ఐదు మున్సిపాలిటీలకు పెరగనున్నది.

సర్కారుకు ప్రతిపాదనలు

రాష్ట్రంలో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వరంగల్), శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కరీంనగర్) సంస్థలను విస్తరించే క్రమంలో ఇటీవల ప్రభుత్వం సమీక్ష నిర్వహించింది. పట్టణాభివృద్ధి సంస్థలను నిర్వహిస్తున్న జిల్లాల కలెక్టర్లకు పలు సూచనలు చేసింది. విస్తరించడం వల్ల అధిక ప్రయోజనాలు ఉన్నందున ఆ దిశగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ యంత్రాంగం నుంచి ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలోనే సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని జిల్లా అంతటా విస్తరించాలంటూ పూర్తి వివరాలతో కూడిన ప్రతిపాదనలను కలెక్టర్ మనూచౌదరి సర్కారుకు చేరవేశారు. త్వరలోనే గ్రీన్‌సిగ్నల్ రావొచ్చనే సంకేతాలు ఉన్నాయి.

ఇప్పటిదాకా సుడా ఛైర్మన్, డైరెక్టర్ పదవులకు సిద్దిపేట మున్సిపాలిటీతోపాటు 26 గ్రామాలకు చెందిన వారినే పరిగణనలోకి తీసుకున్నారు. ప్రస్తుతం జిల్లా అంతటా సుడా విస్తరిస్తున్నందున పదవులు కూడా జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాలకు సంబంధించిన వారిని వరించనున్నాయి. సిద్దిపేట మున్సిపాలిటీతో పాటు గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల మున్సిపాలిటీలు సహ 514 గ్రామాల ప్రజలకు సుడాపై హక్కులు ఉండబోతున్నాయి. సుడా విస్తరణ తర్వాతనే ఈ పదవులను భర్తీ చేయనున్నారని సమాచారం. అప్పటివరకు తాత్కాలికంగా బ్రేక్ పడబోతున్నట్లు తెలిసింది. మున్సిపాలిటీలు, గ్రామాల వారీగా పరిశీలించాకనే నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లుగా అర్థమవుతోంది. ఫలితంగా సిద్దిపేటనే కాకుండా దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల ప్రాంతాల నుంచీ సుడా పదవులను ఆశించే అవకాశం లేకపోలేదు. సర్వ హక్కులతోపాటు ప్రొటోకాల్ నిబంధనలు కలిగిన ఈ సుడా ఛైర్మన్ పదవికి జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ కీలక నేతలంతా రేసులో నిలవడం నిస్సందేహమే.



వాలీబాల్ సర్వీస్ చేస్తున్న బాలిక

ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడలు

- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి 8



రైతుల కోసం వంతెన

- వ్యవసాయ భూములకు వెళ్లేందుకు.. సొంత ఖర్చుతో నిర్మించిన రైతు 7





ఆకాశమందు.. కనువిందు

సంధ్యాకాల సమయంలో ఓవైపు గోదావరి జలాలతో నిండుగా ఉన్న రంగనాయకసాగర్ రిజర్వాయర్ చల్లగా ఆహ్లాదాన్ని పంచుతుంటే.. మరోవైపు ఆకాశం తన రంగును మార్చుతూ కనువిందు చేసింది. ఆకాశవర్ణాలు నీటిపై పడి మరింత అందగా ప్రతిబింబించింది. ఈ దృశ్యాలను రిజర్వాయర్ అందాలను వీక్షించేందుకు వచ్చిన వారు తమ సెల్‌ఫోన్‌లలో బందించి మురిశారు.

- జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి)

కాంగ్రెస్ × బీఆర్ఎస్

నర్మెట్ట రైతు సదస్సులో ఉద్రిక్తత

- బీఆర్ఎస్ కార్యకర్తలను అడ్డుకున్న కాంగ్రెస్ శ్రేణులు
- రైతులే హాజరుకావాలంటూ డిమాండ్
- మేమంతా రైతులమే అన్న బీఆర్ఎస్
- ఇరు పార్టీ నాయకుల మధ్య వాగ్వాదం



బీఆర్ఎస్ నాయకులను అడ్డుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

నంగునూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నర్మెట్ట గ్రామ శివారులోని ఆయిల్‌పామ్ కర్మాగారంలో శనివారం నిర్వహించిన రైతు సదస్సు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదంతో ఉద్రిక్తంగా మారింది. ఈ సదస్సుకు హరీశ్‌రావు హాజరవుతున్నారని తెలుసుకున్న టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తప్పెట శంకర్ తన అనుచరులతో నర్మెట్ట గ్రామానికి చేరుకుని సదస్సుకు వెళ్లే బీఆర్ఎస్ నాయకులను అడ్డుకున్నారు. ఆయిల్ ఫెడ్ ఛైర్మన్, అలాగే జిల్లా మంత్రులకు సమాచారం ఇవ్వకుండానే రైతు సదస్సు ఏర్పాటు చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ శ్రేణులు బీఆర్ఎస్ నాయకులను అడ్డుకుంటూ హరీశ్‌రావు గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. అటు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్, రేవంత్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. విషయం తెలుసుకున్న సిద్దిపేట ఏసీపీలు మధు నేతృత్వంలో పోలీసు బలగాలు అక్కడికి చేరుకుని ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగకుండా చూశారు. అయినా ఇరువర్గాల శాంతించకపోవడంతో నర్మెట్ట చౌరస్తా ఉద్రిక్తతంగా మారింది. రైతులు మాత్రమే సదస్సుకు వెళ్లాలని, బీఆర్ఎస్‌కు నాయకులు వెళ్తే ఊరుకునే ప్రసక్తే లేదని కాంగ్రెస్ నాయకులు మొండికేశారు. తమ అందరికీ ఆయిల్ పామ్ తోటలు ఉన్నాయని, ఎందుకు వెళ్లకూడదని బీఆర్ఎస్ నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆయిల్‌పామ్ అధికారుల నుంచి పోలీసులు లిస్టు తెప్పించి జాబితా ప్రకారం రైతులను సదస్సుకు పంపడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం కాంగ్రెస్ నాయకుల వ్యవహార శైలికి వ్యతిరేకంగా, రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా నర్మెట్ట ప్రధాన చౌరస్తాలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లింగంగౌడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఆయిల్‌పామ్ సాగులో జిల్లాను అగ్రగామిగా నిలపాలి

ఆయిల్‌పామ్ సాగులో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ మను చౌదరి అన్నారు. నంగునూరు మండలం నర్మెట గ్రామంలో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ కర్మాగార ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రూ.300 కోట్లతో కర్మాగారం నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ కర్మాగారానికి రంగనాయక సాగర్ నుంచి నీటిని నిలువ చేసుకోవడానికి ఒక పాండ్ నిర్మించామని తెలిపారు. క్లీన్ ప్లాంట్‌తో, నాణ్యమైన ఆయిల్‌ను ఉత్పత్తి చేస్తుందని వివరించారు. ఫర్టిలైజర్ షాపులలో ఆయిల్‌పామ్ తోటలకు ఎరువులు లభించడం లేదని పలువురు రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, రాష్ట్రస్థాయి అధికారులతో సంప్రదింపులు జరిపి సమస్య పరిష్కరిస్తానని చెప్పారు. అంతకుముందు జిల్లా ఉద్యానవన, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పలు ఆయా యూనివర్సిటీల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు ఎరువుల వాడకం, చీడపీడల నివారణను రైతులకు వివరించారు.

సంత.. సమస్యల చింత

- మద్దూరులో కనీస సౌకర్యాలు కరువు 8

సోయా.. మద్దతు లేదయా?

- కొనుగోలు కేంద్రాల్లేక దళారుల ఇష్టారాజ్యం 7

విద్యుదాఘాతంతో రైతు మృతి

వెల్దుర్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అడవి పందుల నుంచి పంటను రక్షించుకోవడానికి ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు ఓ రైతు తగిలి మృతిచెందాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం యశ్వంతరావుపేట గ్రామంలో చోటు చేసుకున్నది. ఎస్ఐ రాజు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుండెని యాదయ్య(46) శుక్రవారం రాత్రి ఇంట్లో భోజనం ముగించుకుని పొలం వద్దకు అడవి పందుల కాపలాకు వెళ్లాడు. శనివారం ఉదయం చూసేసరికి వన్యప్రాణుల నుంచి పంట రక్షణ కోసం ఏర్పాటుచేసిన విద్యుత్ తీగలకు తగిలి మృతిచెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఇందిర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి ఇద్దరు కుమారులు ఉన్నారు.


యాదయ్య(ఫైల్)

మంత్రాలు చేస్తున్నాడని కుటుంబంపై దాడి

- మృతిచెందిన కుటుంబ పెద్ద ఆత్మ తిరుగుతుందని..
- మెదక్ జిల్లా తూప్రాన్ మండలం కిష్టాపూర్‌లో ఘటన

తూప్రాన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మంత్రాలు చేస్తున్నాడని ఓ కుటుంబంపై దాడికి పాల్పడిన సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ మండలం కిష్టాపూర్‌లో శనివారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన భూమొల్ల పోచయ్య మూడు నెలల క్రితం మృతిచెందాడు. పోచయ్య చనిపోవడంతో భార్య భూమొల్ల కమలమ్మ, కుమారుడు భూమొల్ల స్వామి, కోడలు నవనీతలతోపాటు బిడ్డలు, అల్లుళ్లను రప్పించి పెద్దలకు పండుగ చేశారు. పండుగ చేయడం గిట్టని కొందరు కులస్తులు శనివారం ఉదయం పోచయ్య ఆత్మ మా ఇళ్ల చుట్టూ తిరుగుతుందని కమలమ్మ ఇంటికి వచ్చారు. చౌరస్తా వద్దకు పిలుచుకుపోయి బిందెతో వళ్లు పట్టారు. కొందరు పూనకాలు ఊగుతూ.. కొందరి పేర్లను చదివారు. ఏమీ లేదంటూ ఇళ్లకు పంపించారు. కొద్దిసేపటికి మళ్లీ ఇంటి వద్దకు వచ్చి స్వామిని బయటకు పిలిచారు. మంత్రాలు చేస్తున్నావని, పోచయ్య ఆత్మ తిరుగుతుందని దుర్భాషలాడుతూ దాడిచేశారు. అడ్డువచ్చిన తల్లి కమలమ్మ, కోడలు నవనీతపై కూడా దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.


దాడికి గురైన భూమొల్ల కమలమ్మ కుటుంబీకులు

'గుణాత్మక బోధన అందించాలి'


మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

జిన్నారం/నిజాంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు గుణాత్మకమైన బోధన అందించాలని డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం మండలంలోని కొడకంచి ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించి, విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రతిరోజు తమ పిల్లలు పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని కోరారు. పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధించేందుకు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ప్రేమావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులకు టీవీ, మొబైల్స్ దూరంగా ఉంచి పరీక్షలకు సన్నద్ధం చేయాలని ప్రధానోపాధ్యాయుడు పద్మారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని రాంపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం విద్యార్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు పట్టణ సీఐ ఎస్.భాస్కర్ తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో 35 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి పాతబస్టాండ్ సమీపంలో స్పృహ లేకుండా పడి ఉన్నాడు. బస్టాండ్ ఆర్టీసీ కంట్రోలర్ మెట్టు కిషన్ 100 నంబర్‌కు డయల్ చేసి ఫిర్యాదు చేయగా.. అతడిని 108 సిబ్బంది సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అతడికి వెంటిలేటర్‌పై ఉంచి వైద్య చికిత్స అందిస్తుండగా మృతిచెందినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచినట్లు చెప్పారు. సదరు వ్యక్తి ఒంటిపై క్రీం కలర్ ప్యాంటు, లేత ఆకుపచ్చ రంగు హాఫ్ టీ షర్ట్ ఉందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 08455 276333 లేదా 8712656718 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ భాస్కర్ కోరారు.

క్రైం కార్నర్

పరిశ్రమ సంపులో పడి కార్మికుడి మృతి


రాజేష్‌కుమార్ మృతదేహం

జిన్నారం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సంపులో ప్రమాదవశాత్తు పడి కార్మికుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే భద్రాద్రి జిల్లా భద్రాచలంకు చెందిన రాజేష్‌కుమార్ (31) గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సెల్‌మార్ ల్యాబ్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. శనివారం ఉదయం విధులకు హాజరైన రాజేష్‌కుమార్ బ్రైన్ ట్యాంకు(సంపు)లో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న బొల్లారం సీఐ గంగారం, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని కార్మికుడి మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యాజమాన్యం నిర్లక్ష్యంతోనే రాజేష్‌కుమార్ మరణించాడని, అతడి కుటుంబానికి రూ.50లక్షల నష్ట పరిహారం చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య డిమాండ్ చేశారు.

చెరువులో పడి వ్యక్తి..


శ్రీనివాస్(ఫైల్)

చేగుంట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన నార్సింగి మండల పరిధిలోని నర్సంపల్లిలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై అహ్మద్ మోహినుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఉడుత శ్రీనివాస్ (50) స్థానిక మసిన్ చెరువులో చేపల వేటకోసం శుక్రవారం సాయంత్రం వల వేశాడు. మరుసటి రోజు తెల్లవారు జామున వలను తీసుకురావడానికి వెళ్లిన శ్రీనివాస్‌కు ఫిట్స్ రావడంతో వల చుట్టుకుని నీటమునిగి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించారు. భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డీసీఎం ఢీకొని వ్యక్తి..

మిరుదొడ్డి, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే భూంపల్లి గ్రామానికి చెందిన పర్స నారాయణ(45) రిపేర్ కోసం ఇచ్చిన సైకిల్‌ను తెచ్చేందుకు మరో వ్యక్తి మోటర్‌సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన నారాయణను సిద్దిపేట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి మహిళ..


సాయమ్మ(ఫైల్)

కౌడిపల్లి, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ బోల్తాపడి మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని కూకుట్ల పల్లిలో శనివారం జరిగింది. మృతుని కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వెంకటపూర్ (బి) గ్రామానికి చెందిన బడిగంటి సాయమ్మ తన ఇంటి అవసరాల నిమిత్తం అదే గ్రామానికి చెందిన యాదగౌడ్ అనే వ్యక్తి ట్రాక్టర్‌ను కిరాయి తీసుకుని కౌడిపల్లికి వెళ్లి డస్టు (రాయి పొడి)ను లోడ్ చేయించుకుని వస్తున్నది. సాయమ్మ ట్రాక్టర్‌లోని డస్టుపై కూర్చోగా మల్లు కుంట సమీపంలోకి రాగానే ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో సాయమ్మ పూర్తిగా డస్టులో కప్పిపోయి అక్కడికక్కడే మృతి చెందగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన పదిరోజులకు చెరువులో శవమై..


దాసు(ఫైల్)

తూప్రాన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన వ్యక్తి చెరువులో శవ తేలిన సంఘటన తూప్రాన్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం ప్రకారం మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన బండెల దాసు(45) ఈ నెల 9న పక్క స్థలం వాళ్లు చెట్లు కొట్టగా అటవీ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు మనోహరాబాద్‌కు వెళ్లి తిరిగిరాలేదు. పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకి లభించలేదు. కాగా, శనివారం తూప్రాన్ పెద్ద చెరువులో కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం కనిపించింది. వెలికితీసి పరిశీలంగా శరీరంపై ఉన్న పచ్చబొట్టు ఆధారంగా బండెల దాసుగా గుర్తించారు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల కోసం వంతెన

తను.. తన వాళ్లు బాగుంటే చాలు అని ఆలోచిస్తున్న ప్రస్తుత తరుణంలో ఓ రైతు తన కోసమే కాకుండా తోటి రైతుల కోసం ఆలోచించాడు. ఎవరో వచ్చి తమ కష్టాలు తీరుస్తారని ఎదురు చూడకుండా తన సొంత ఖర్చుతో వాగుపై వంతెన నిర్మించాడు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం చేయాల్సిన పని అతనొక్కడే పూర్తి చేయగా.. ఇప్పుడా వంతెనపై నుంచి వందలాది మంది రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లి వస్తున్నారు. వర్షాకాలం వస్తే ప్రాణాలు అరచేత పట్టుకుని వాగుదాటే తమ కోసం రైతు చేసిన మేలును మరువలేమని అంటున్నారు.


రాములు నిర్మించిన వంతెన

- వ్యవసాయ భూములకు వెళ్లేందుకు..
- సొంత ఖర్చుతో నిర్మించిన రైతు
- వర్షం వస్తే పొంగిపొర్లే గుండవాగు
- పట్టించుకోని అధికారులు..
- రూ.2 లక్షలు వ్యయంతో కట్టిన రైతు

టేక్మాల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : అతనో సామాన్య రైతు. సాగు తప్ప మరో పని తెలియదు. వర్షాకాలం వచ్చిందంటే తన వ్యవసాయ భూమికి వెళ్లేందుకు వాగు అడ్డం వస్తుంది. పొంగిపొర్లే ఆ వాగులో ప్రవాహం తగ్గిన తర్వాతే తాను సాగు చేస్తున్న భూమికి వెళ్లాల్సిన పరిస్థితి. ఆ గ్రామంలోని రైతులందరిదీ అదే పరిస్థితి. తమ వ్యవసాయ భూములకు దారి కల్పించాలని.. ఇందుకోసం ఓ చిన్న వంతెన నిర్మించాలని ఆ రైతులు ఎన్నో సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా.. పట్టించుకునే వారే లేకుండా పోయారు. దీంతో ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూడటం వృథా అనుకున్నాడా రైతు. అంతే, ఆయనే ఇంజనీర్‌గా మారి సొంత ఖర్చుతో ఏకంగా వంతెన నిర్మించాడు. తన పంట పొలాలకే కాదు.. రైతుల వందల ఎకరాలకు దారి చూపించాడు. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది.

ఇదీ సంగతి..

మెదక్ జిల్లా టేక్మాల్‌కు చెందిన కుమ్మరి రాములు అనే రైతుకు ఇదే మండలంలోని గుండువాగు అవతల సుమారు 15 ఎకరాలు వ్యవసాయ భూమి ఉంది. అందులో పత్తి, వరి సాగు చేస్తాడు. అతనితో పాటు ఇతర రైతులకు చెందిన వందల ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. ఇతర రోజుల్లో బాగానే ఉన్నా.. వర్షాకాలం వచ్చిందంటే ఆ రైతులకు పెద్ద కష్టం వచ్చి పడుతుంది. వారి వ్యవసాయ భూములకు వెళ్లాలంటే గుండు వాగు దాటాల్సిందే. అయితే, ప్రతీ సీజన్‌లోనూ ఆ వాగు నిండుగా ప్రవహించడంతో రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లలేని పరిస్థితి. కొందరు ప్రాణాలు అరచేత పట్టుకుని వాగుదాటి వ్యవసాయ పనులు చేసుకునేవారు. అయితే, ఈ విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి.. గుండెవాగుపై వంతెన నిర్మిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని విన్నవించారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా.. ఎవరూ పట్టించుకోకపోవడంతో రైతు కుమ్మరి రాములు ముందుకు వచ్చారు. సొంత ఖర్చుతో గుండెవాగుపై వంతెన నిర్మించాడు. ముందుగా వేసవి కాలంలో వాగులో ఇనుప స్థంభాలు ఏర్పాటు చేశాడు. తర్వాత వాటిరి ఇనుప రాడ్లు పెట్టించి వంతెన పూర్తి చేశాడు. దీనికోసం రూ.2.10 లక్షలు ఖర్చు కాగా, ఒక రైతు రూ.30 వేలు ఇవ్వగా, మిగిలిన డబ్బులన్నీ రాములు ఖర్చు చేశాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుండువాగు నిండుగా ప్రవహించింది. ఈ సందర్భంలో రైతులు రాములు నిర్మించిన బ్రిడ్జి మీదుగా తమ వ్యవసాయ భూముల వద్దకు దర్జాగా వెళ్లి వచ్చారు. తమ వ్యవసాయ భూములకు ఏ సమయంలోనైనా వెళ్లి వచ్చేందుకు బ్రిడ్జి నిర్మించిన రాములును ఆ ప్రాంత రైతులు అభినందిస్తున్నారు. అతనికి రుణపడి ఉంటామని అంటున్నారు.

15 ఎకరాల భూమి ఉంది..



నాకు 15 ఎకరాల వ్యవసాయ సాగు భూమి ఉంది. అందులో వివిధ రకాల పంటను సాగు చేస్తుకుంటు జీవనం సాగిస్తాను. వర్షాలు కురిసి వరద వచ్చినప్పుడల్లా నాతోపాటు మరి కొంత మందిరైతులు తమ వ్యవసాయ పొలాలకు వెళ్లాలంటే గుండువాగు అడ్డం వచ్చేది. దీంతో ఇబ్బందులు పడేవాళ్లం. పొలం వద్దకు వెళ్లాలంటే వంతెన ఒక్కటే మార్గమని భావించాను. ఇందుకు రూ.2 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేసి పనులు ప్రారంభించాను. 20 రోజుల్లో వంతెన పనులు పూర్తి చేశాను. అనుకున్న విధంగా వంతెన పూర్తి చేసినా.. ఇప్పుడు దానిపై షీట్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

- రైతు కమ్మరి రాములు

రేపు ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రాజేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి జుబ్లీక్లబ్ ప్రాంగణంలోని ఎంఎస్ అకాడమీలో అండర్-23 ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 10 గంటల వరకు బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. క్రీడాకారులు 1.9.2001 తర్వాత జన్మించిన వారై ఉండాలని, జిల్లా జట్టులో ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 4 నుంచి జరిగే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు.

భూ తగాదాలతో అన్నపై కత్తితో దాడి

పాపన్నపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దాయాదుల మధ్య జరగుతున్న భూ పంచాయతీలో అన్నపై తమ్ముడు కత్తితో దాడి చేసిన సంఘటన శనివారం మండల పరిధిలోని నామాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ముచ్చె చిన్న రామయ్య, ముచ్చె లక్ష్మయ్య సొంత అన్నదమ్ములు. రామయ్య కొడుకు ముచ్చె లింగమయ్య పేరిట 7 గుంటల భూమి ఎక్కువగా నమోదు అయ్యింది. ఆ భూమిని తిరిగి తన పేరిట చేసి ఇవ్వాలని లక్ష్మయ్య కొడుకు కుమార్ కోరుతున్నాడు. గత రెండేళ్లుగా ఈ వివాదం కొనసాగుతుంది. శనివారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన పంచాయితీ వద్ద ఘర్షణ జరగగా ముచ్చె కుమార్ వేట కత్తితో లింగమయ్యపై దాడి చేయగా గొంతు, తలపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో గ్రామస్థులు కుమార్‌ను చితక బాదగా, అతడు పారిపోయి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలిసింది. లింగమయ్యను మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ వివరించారు.

ఈ ప్రధానోపాధ్యాయుడు మాకొద్దు..

- విద్యార్థులను అవహేళన చేస్తున్నాడు ● బదిలీ చేస్తేనే బడికి వస్తాం
- పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తీసుకుంటాం: ఎంఈవో

చిన్నశంకరంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): 'విద్యాబుద్ధులు నేర్పిస్తూ.. పాఠశాలను మెరుగైన స్థితిలో ఉంచాల్సిన ప్రధానోపాధ్యాయుడు చీటికి మాటికి తమను హేళన చేసి మాట్లాడుతున్నాడు.. ఈ హెచ్‌ఎం మాకొద్దు' అని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు గాలయ్య మెదక్ మండలం వెంకటాపూర్ నుంచి ఇటీవల బదిలీపై వచ్చారు. ప్రతీ చిన్న విషయానికి విద్యార్థులతో అవహేళనగా ప్రవరిస్తూ కించపరుస్తున్నాడని, అతడిని ఇక్కడి నుంచి పంపిస్తేనే పాఠశాలకు వెళ్తామని విద్యార్థులు చెబుతున్నారు. శనివారం ఈ విషయాన్ని విద్యార్థులు తమ తల్లిదండ్రులకు తెలపడంతో వారు పాఠశాలకు చేరుకుని గాలయ్యను నిలదీయడంతోపాటు డీఈవో రాధాకిషన్, ఎంఈవో పుష్పవేణికి ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. ఎంఈవో పాఠశాలకు చేరుకుని ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడారు. తీరు మార్చుకోకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించి మరోసారి ఈ విషయం మా దృష్టికి వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాని సర్దిచెప్పారు. విద్యార్థులకు సరైన బోధన అందించాలని ఎంఈవో ఉపాధ్యాయులకు ఆదేశించారు.


ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు


దిడిగి శివారులో అటవీ ప్రాంతంలో పారబోసిన వ్యర్థజలాలు

వ్యర్థజలాల పారబోత

- కలుషితమవుతున్న భూములు, ఎండిపోతున్న చెట్లు

జహీరాబాద్,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దిడిగి శివారులోని అటవీ ప్రాంతంలో వివిధ రసాయన పరిశ్రమలకు చెందిన వ్యర్థజలాలను తీసుకువచ్చి పారబోయడంతో పరిసరప్రాంతాలు కలుషితమవుతున్నాయి. వర్షాలు కురుస్తున్న సమయాల్లో ఈ వ్యర్థ రసాయన జలాలు నేరుగా వరదతో కలిసి దిడిగి చెరువులోకి, అక్కడి నుంచి నారింజాలోకి వెళ్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు విషపూరితంగా మారుతున్నాయన్నారు. దీంతో చెట్లన్నీ ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రసాయనాలతో కలుషితమైన గడ్డిని మేసి, నీటి తాగి మూగజీవాలు మృత్యువాత పడే అవకాశం ఉందని గ్రామప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై వెంటనే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని శనివారం గ్రామస్థులు సంబంధిత అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు.


ఎండిపోయిన చెట్లు

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్


అల్లాదుర్గం పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

అల్లాదుర్గం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం అల్లాదుర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ ఆసుపత్రికి నిత్యం ఎంతమంది రోగులు వస్తున్నారని, ఏఏ సమస్యలు ఉన్నాయని స్థానిక వైద్యాధికారి డాక్టర్ అశ్వినిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్యం అందుతుందన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యసిబ్బందికి సూచించారు. వైద్యాధికారులు, వైద్యసిబ్బంది పనితీరు పై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు.

ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక

మెదక్ అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థులకు శనివారం ఎన్‌సీసీ సెలక్షన్స్ ప్రక్రియ నిర్వహించారు. సంగారెడ్డి ఆర్మీ అధికారి మహేష్ బచత్, గురుప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపికలకు మొత్తం 200 మంది విద్యార్థులు పాల్గొన్న వారిలో ప్రాథమికంగా 100 మందిని ఎంపిక చేసినట్లు ఎన్‌సీసీ ఇన్‌చార్జి అధికారి సురేందర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపికైన విద్యార్థులకు మూడేళ్లపాటు శిక్షణ ఇస్తామని, దీన్ని ద్వారా ఆర్మీ, పోలీసు, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ తదితర ఉద్యోగాలకు అర్హతను పొందవచ్చునన్నారు.


ఎన్‌సీసీ కేడెట్ల ఎంపికలో విద్యార్థులు

విద్యార్థుల ఆటోను ఢీకొట్టిన ట్రాలీ ఆటో

- ఒకరికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న విద్యార్థి ప్రేమ్

చేగుంట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చేగుంట అదర్శ పాటశాల విద్యార్థులను తరలిస్తున్న అటోను ముందు నుంచి ట్రాలీ ఆటో ఢీ కొనడంతో ఒక విద్యార్థికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం సాయంత్రం చేగుంట బైపాస్ బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే చేగుంట అదర్శ పాఠశాలకు నిత్యం ఆటోలో విద్యార్థులు వెళ్లివస్తుంటారు. రోజు మాదిరిగానే విద్యార్థులను సాయంత్రం పాఠశాల నుంచి ఆటోలో ఎక్కించుకుని బయలుదేరగా చేగుంట బైపాస్ బ్రిడ్జి వద్దకు రాగానే ఎదురుగా ట్రాలీ ఆటో వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఆటోలో ఐదుగురు విద్యార్థులు కూర్చోగా.. అఖిల్, అజేయ్, ప్రణిత, అంజలీ నల్గురు ఆటో వెనుకలో కూర్చున్నారు. డ్రైవర్ పక్కన కూర్చున్న ఎనిమిదో తరగతి విద్యార్థి గడ్డం ప్రేమ్ ఎడమ కాలు నుజ్జునుజ్జయింది. అతడికి చేగుంటలో ప్రథమ చికిత్స అందించి తూప్రాన్‌లోని ఓ ప్రయివేట్ అసుపత్రికి తరలించారు. అనంతరం అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. రోజూ విద్యార్థులను తీసుకేళ్లే డ్రైవర్ శుభకార్యం ఉందని వేరే వ్యక్తిని పంపించడంతో ఈ ప్రమాదం జరిగిందని విద్యార్థులు వాపోతున్నారు. మిగితా విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమదం తప్పింది.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాములు

దృష్టిని మరల్చడానికే హైడ్రామా

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీరయ్య, చుక్కరాములు

జహీరాబాద్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): ప్రజల దృష్టిని మళ్లించడానికే రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా అనే డ్రామాకు తెరలేపిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీరయ్య, చుక్కరాములు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో సీపీఎం జిల్లా 3వ మహాసభ శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని దారి మళ్లించేందుకే ప్రభుత్వం హైడ్రా పేరిట డ్రామాను మొదలు పెట్టిందన్నారు. అఖిలపక్షంతో చర్చలు జరిపాకే మూసీ ప్రక్షాళన చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లికార్జున్, మల్లారెడ్డి, మల్లేశం, జయరాజ్, రాజయ్య, మాణిక్యం, రాంచంద్రం, సాయిలు, మైపాల్, నర్సయ్య, రాజిరెడ్డి, చంద్రన్న, సంగన్న వీరగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సోయా.. మద్దతు లేదయా!

- కొనుగోలు కేంద్రాల్లేక దళారుల ఇష్టారాజ్యం
- తేమ పేరిట నిలువు దోపిడీ.. నష్టపోతున్న రైతులు
- కంగ్టిలో సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్


దెగుల్‌వాడిలో సోయాను ఆర బెడుతున్న రైతు

కంగ్టి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులకు తీరా పంట ఇంటికొచ్చే సరికి మద్దతు ధర లభించక దళారుల చేతిలో దగాపడుతున్నారు. వర్షాధార పంటలసాగు అధికంగా ఉన్న కంగ్టి మండలంలో ఈసారి ఖరీఫ్‌లో రైతులు 12 వేల ఎకరాల్లో సోయా సాగు చేశారు. ప్రస్తుతం పంట మొత్తం రాశులు చేసుకున్న రైతులు అమ్ముకుందామంటే స్థానికంగా కొనుగోలు కేంద్రం లేకపోవడంతో మద్దతు ధర దక్కడంలేదు. ఖరీఫ్‌లో సాగు చేసిన సోయాపంటకు కేంద్రప్రభుత్వం క్వింటాల్‌కు రూ.4892గా నిర్ణయించింది. కాని స్థానికంగా వ్యాపారులు మాత్రం రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని తేమ, తరుగు, నాసిరకం అంటూ కొర్రిలు పెడుతూ క్వింటాల్‌కు రూ.3800 నుంచి రూ.4200లకే కొంటున్నారు. దీంతో ఒక్క క్వింటాల్ సోయాపై రైతులు రూ.700 వరకు నష్టపోవాల్సి వస్తుంది. స్థానికంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రం లేక పోవడంతో తప్పని పరిస్థితుల్లో రైతులు దళారులకే అమ్ముకోవాల్సి వస్తుంది. కంగ్టి మండలం రాష్ట్ర సరిహద్దుల్లో ఉండడంతో ఇక్కడి వ్యాపారులు సోయా పంటను రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి పక్క రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈసారి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వల్ల సోయాపంట దిగుబడి బాగా తగ్గడం, ప్రస్తుతం మద్దతు ధర లభించక పోవడం తో రైతులు వాపోతున్నారు. సోయా సాగు అధికంగా ఉన్న కంగ్టి మండలంలో మార్క్‌ఫెడ్ అధికారులు స్పందించి స్థానికంగా సోయా కొనుగోలు కేంద్రంఏర్పాటు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి వెంకటేశంను సంప్రదించగా డీసీఎంఎస్ అధికారులతో చర్చించామని, ఇప్పటికే మనూరులో కొనుగోలు కేంద్రం ఉన్నందున కంగ్టిలో సబ్‌సెంటర్ ఏర్పాటుపై ఆలోచిస్తామని తెలిపారని ఆయన పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాలతోనే రైతులకు మేలు : రవీందర్‌రెడ్డి



ఆరుగాలం శ్రమించి తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర దొరకాలంటే ప్రభుత్వం రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. చాలా మంది రైతులు తప్పని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించి ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతునానరు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య


రాజేశం(ఫైల్)

చిన్నకోడూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితం పై విరక్తి చెందిన వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం జరిగింది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం చిన్నకోడూరుకు చెందిన వేములవాడ రాజేశం (70) సెంట్రింగ్ మేస్త్రీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొన్నేళ్లుగా రాజేశం మోకాళ్ల నొప్పులు, బీపీ, షుగర్, తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీనిపై కుటుంబ సభ్యులతో తరచూ చెబుతూ మనస్తాపానికి గురయ్యేవాడు. కాగా, శుక్రవారం రాత్రి రాజేశం అతని భార్య రాధ బిల్డింగ్‌పై గదిలో నిద్రిస్తున్నారు. తెల్లవారు జామున రాధకు చలిగా అనిపించడంతో కింద ఉన్న గదిలోకి వచ్చి పడుకుంది. ఉదయం కుటుంబ సభ్యులు రాజేశంను నిద్ర లేపేందుకు పైకి వెళ్లి చూడగా తలుపు లోపలి వైపు గడియ వేసి ఉంది. కిటికిలో నుంచి చూడగా రాజేశం గది పై కప్పు ఇనుప రాడ్డుకు తాడుతో ఉరివేసుకొని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సంత.. సమస్యల చింత

● అటకెక్కిన పనులు ● చిరువ్యాపారులకు తప్పని తిప్పలు ● నిధులు మంజూరు చేయాలని వేడుకోలు

మద్దూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమీకృత గ్రామీణ సంత నిర్మాణ పనులు మూడేళ్లు దాటినా ముందుకు సాగడం లేదు. ఉపాధిహామీ, జీపీ, ఎస్‌డీఎఫ్ నిధులు రూ.25 లక్షలతో చేపట్టిన సంత నిర్మాణానికి 26, 2021లో మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఎంతో ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు.

రూ. 25 లక్షలతో పనులు..

ఉపాధిహామీ నిధులు రూ.10 లక్షలు, జీపీ నిధులు రూ.5 లక్షలు, ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.10 లక్షలతో కలిపి 30 గదులు, ప్లాట్‌ఫామ్, పార్కింగ్, టాయ్‌లెట్స్, తాగునీటి సౌకర్యాలతో పాటు ఆఫీసు, స్టోర్ రూం, తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. స్థల లభ్యత లేని కారణంగా స్థానిక ఉన్నత పాఠశాల స్థలంలోనే రోడ్డు పక్కన శాశ్వత నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టి పక్కా స్లాబ్‌తో 21 షట్టర్ల నిర్మాణ పనులు మొదలుపెట్టారు. నిధులు సరిపోకపోవడంతో పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. మాజీ సర్పంచ్ కంతారెడ్డి జనార్దన్‌రెడ్డి అప్పటి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా అదనంగా రూ.5 లక్షల మంజూరుకు హామీ ఇచ్చారు. ఎస్‌డీఎఫ్ నిధుల జాడలేకుండా పోవడంతో సంత నిర్మాణ పనులు అసంపూర్తిగా మారి వెక్కిరిస్తున్నాయి. సంత పనులు నిలిచిపోవడంతో కూరగాయల అమ్మకదారులు అక్కడే రోడ్డు మీద విక్రయాలు కొనసాగిస్తున్నారు. మట్టి రోడ్డు కావడంతో వర్షాలు వచ్చినప్పుడు అమ్మకదారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.



రోడ్డుపై క్రయవిక్రయాలు, అసంపూర్తిగా సమీకృత గ్రామీణ సంత నిర్మాణం (ఇన్‌సెట్‌లో)

డీఎంఎఫ్‌టీ నిధుల మళ్లింపుకు వినతి

మే 13, 2022లో డీఎంఎఫ్‌టీ (డిస్టిక్ మినరల్ ఫౌండేషన్ ట్రస్టు) ద్వారా మద్దూరు గ్రామ పంచాయతీకి, షాపింగ్ క్లాంపెక్స్ నిర్మాణానికి గానూ రూ.20 లక్షలు మంజూరవ్వగా మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి శంకుస్థాపన చేశారు. అసంపూర్తిగా మారి వెక్కిరిస్తున్న సమీకృత గ్రామీణ సంత నిర్మాణ పనులకు డీఎంఎఫ్‌టీ నిధులు మళ్లించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి మాజీ సర్పంచ్ కంతారెడ్డి జనార్దన్‌రెడ్డి రాతపూర్వకంగా తెలియపరిచారు. దీంతో సంబంధిత శాఖకు ఆయన సిఫారసు చేస్తూ రాసిన లేఖ జిల్లా కలెక్టర్ వద్దకు చేరింది. ఈ లోపు అసెంబ్లీ ఎన్నికల ఎలక్షన్ కోడ్ రావడంతో లేఖను పక్కన పెట్టేశారు. నూతన ప్రభుత్వం కొలువు దీరినా సంత నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో చిరువ్యాపారులకు తిప్పలు తప్పడం లేదు.

సౌకర్యాలు కల్పించాలి



అంగడికి రావట్టి 5 ఏళ్లు అవుతుంది. కనీస సౌకర్యాలు లేవు. రైతు బజారు సగం పనులతో ఆగిపోయిందంటున్నారు. పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలి. సంతలో వ్యాపారం నిర్వహించుకునే వారికి సౌకర్యాలు కల్పించాలి. తాగునీరు, మరుగుదొడ్ల లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

- చింతల పోచయ్య, అమ్మకదారుడు, ముస్త్యాల గ్రామం

ఇబ్బందులు తొలగించాలి



పండించిన కూరగాయలు అమ్ముకుందామని అంగడికి వస్తే ఇక్కడ ఎలాంటి సౌలతులు లేకుండా ఉంది. సంతలో గుక్కెడు మంచినీళ్ల సౌకర్యం లేక తిప్పలు పడుతున్నాం. అంగడికి వచ్చే వ్యాపారుల ఇబ్బందులు తీర్చాలి.

- బోడపట్ల పోషమ్మ, అమ్మకదారురాలు, రేబర్తి గ్రామం

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

దుబ్బాక, అక్టోబరు 19: ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన వేల్పుల అంజయ్య (51)కు రెండు ఎకరాల భూమి ఉండగా.. మరో రెండు ఎకరాలను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. అంజయ్య కొన్నాళ్లుగా కుటుంబ కలహాలతోపాటు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం తాను కౌలుకు చేస్తున్న పోతరెడ్డిపేట శివారులోని పొలం వద్దకు వెళ్లి శనివారం వరకూ ఇంటికి తిరిగిరాలేదు. పొలం సమీపంలోని చెట్టుకు ఆయన ఉరేసుకుని కనిపించగా స్థానికులు భూంపల్లి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య గంగమణి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడు సుమారు రూ.3 లక్షల వరకు అప్పు చేసినట్టు భార్య తెలిపింది.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పొదల తొలగింపు



బండచెర్లపల్లి నుంచి పుల్లూరు వెళ్లే రోడ్డులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ తొలగించిన పొదలు

సిద్దిపేట రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అనే శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. సిద్దిపేట రూరల్ మండలం బండచెర్లపల్లి నుంచి పుల్లూరు వెళ్లే రోడ్డులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న చెట్ల పొదలను తొలగించారు. అదేవిధంగా పుల్లూరులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పిచ్చి మొక్కలను తొలగించారు. గ్రామాల్లో ప్రమాదకరంగా చేతికి అందే ఎత్తులో ఉన్న సింగిల్ ఫేజ్ డీటీఆర్‌ల ఎత్తు పెంచేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిసింది.

ప్రజలకు అండగా నిలిచే ఏకైక పార్టీ కాంగ్రెస్

● మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



బీఆర్‌ఎస్ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ అండగా నిలుస్తుందని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ మండల పరిధిలోని అక్కారంకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు శనివారం కాంగ్రెస్ చేరారు. ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఆయనవెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరార్‌ఖాన్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, నాయకులు సుభాష్ చంద్రబోస్, నక్క రాములుగౌడ్, మహ్మద్ సమీర్, బెజుగామ శివరాంరెడ్డి, గంగిశెట్టి రాజు, సుఖేందర్, అక్కారం యాదగిరి ఉన్నారు.

వారం రోజుల్లో ఆస్పత్రిని ప్రారంభించాలి

● బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలో గత ప్రభుత్వ హయాంలో రూ.28కోట్ల వ్యయంతో నిర్మించిన మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని వారం రోజుల్లో ప్రారంభించాలని బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించి, అక్కడున్న మహిళలతో, వైద్యులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాకో మెడికల్ కళాశాల, నియోజకవర్గానికో మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించామన్నారు. రూ.28కోట్లతో ఆసుపత్రిని, రూ.10కోట్ల వైద్య పరికరాలను ఏర్పాటు చేస్తే ఇంతవరకు ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేకపోయారని మండిపడ్డారు. పది రోజుల్లో ఆసుపత్రిని ప్రారంభించని పక్షంలో మహిళలతో కలసి ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఆయనవెంట గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నవాజ్‌మీరా, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, అత్తెల్లి శ్రీనివాస్, కూరాకుల శ్రీనివాస్, నీర్ల మల్లేశం, మర్కంటి కనకయ్య, నాయకులు కల్యాణ్‌కర్ శ్రీనివాస్, ఆర్కే శ్రీనివాస్, భూపాల్‌రెడ్డి, పేపర్ శ్రీనివాస్, సాయిబాబా తదితరులున్నారు.

స్లాటర్ హౌజ్‌లోనే మేకలు, గొర్రెలను వధించాలి

● సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట టౌన్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): ప్రజలకు శుచికరమైన, నాణ్యమైన మాంసాన్ని అందించాలనే ఉద్దేశంతో నిర్మించిన స్లాటర్ హౌజ్‌లోనే మేకలు, గొర్రెలను వధించి, మాంసంపై పశువైద్యులు ఆమోదముద్ర వేసిన తర్వాతే విక్రయించాలని మాంసం విక్రయదారులకు సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సూచించారు. సిద్దిపేట పట్టణంలోని సమీకృత మార్కెట్‌యార్డులోని నాన్‌వెజ్ మార్కెట్‌లో మాంసం వ్యాపారస్తులు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ వనితలతో కలిసి శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆశ్రిత్‌కుమార్ మాట్లాడుతూ.. ఆధునిక పద్ధతిలో మాంసం వ్యర్థాలతో గ్యాస్‌ను ఉత్పత్తి చేసే ఇఫ్లూమెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న కోల సద్గుణ రవీందర్

కుకునూరుపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాముని పల్లి, బొప్పాయిపల్లి, కుకునూరుపల్లి గ్రామాలకు చెందిన రెడ్డమైన కొండయ్య రూ. 7500, రెడ్డమైన రామయ్య రూ. 11000, మహిపాల్ రూ. 7500, మల్లేశం 11000, ప్రభాకర్ రూ. 8500 చెక్కులను ఎన్‌ఆర్‌ఈజీఎస్ సభ్యురాలు కోల సద్గుణ రవీందర్ అందజేశారు. లబ్ధిదారులు కోల సద్గుణ రవీందర్‌కు ధన్యవాదాలు తెలిపారు. వారివెంట బొబ్బాయిపల్లి మాజీ సర్పంచ్ కోల శ్రీను ఉన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గజ్వేల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్‌అర్ కాలనీలో శనివారం చోటుచేసుకుంది. కాలనీకి చెందిన ప్రభాకర్ (22) ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో ఈనెల 15న తన మొబైల్ ఫోన్లో తాను చనిపోతున్నానని వాట్సాప్ స్టేటస్ పెట్టుకుని, ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వాట్సాప్ స్టేటస్ చూసిన స్నేహితులు, బంధువులు ఇంటికి వెళ్లి చూడగా సీలింగ్‌కు వేలాడుతున్నాడు. వెంటనే కిందికి దించి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపారు.

భార్య చనిపోయిందన్న మనోవేదనతో భర్త ఆత్మహత్య

గజ్వేల్, అక్టోబరు 19: భార్య చనిపోయిందన్న మనోవేదనతో భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన గజ్వేల్ మండలం కొల్గురులో శనివారం చోటుచేసుకున్నది. గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండారు లింగయ్య(55) గ్రామపంచాయతీలో సఫాయిగా పనిచేస్తున్నాడు. లింగయ్య భార్య ఆరునెలల క్రితం మృతిచెందింది. ఆమె చనిపోయిందన్న దిగులుతో అతడు అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలోనే శనివారం ఉదయం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయమై లింగయ్య కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అనారోగ్యంతో విద్యార్థి మృతి

గజ్వేల్ రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో డిగ్రీ విద్యార్థి మృతి చెందిన ఘటన శనివారం గజ్వేల్ పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జగదేవ్‌పూర్ మండలం తిగుల్‌కు చెందిన స్వర్గం చంద్రశేఖర్ నాగలక్ష్మి దంపతులు పిల్లలతో కలిసి గజ్వేల్ పట్టణంలో నివాసం ఉంటున్నారు. వారి కుమారుడు బన్ని ప్రసాద్(20) సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం ఉదయం అతడు అనారోగ్యానికి గురికావడంతో స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

దూళిమిట్ట, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని కూటిగల్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గీత కార్మికుడు పొన్నం వెంకటయ్య (58)రోజువారి వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కే క్రమంలో జారీ పడి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



ఓటుహక్కు నమోదు చేసుకోండి

మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు నమోదు అవగాహన కోసం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో భారీ కటౌట్ ఏర్పాటు చేశారు. ఓటు నమోదుకు కావాల్సిన పత్రాలు, రిజిస్ట్రేషన్ గడువు వంటి వివరాలు కటౌట్‌లో వివరంగా పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు.

- సిద్దిపేట ఫొటోగ్రాఫర్

వానాకాలం రైతుబంధును విడుదల చేయాలి

● రైతుబంధు రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు దేవీరవీందర్

గజ్వేల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ రైతుబంధును వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని రైతుబంధు రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు దేవీరవీందర్ డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బెండే మధు ఆధ్వర్యంలో రైతుబంధుపై మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వ్యాఖ్యలకు నిరసనగా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌తో కలసి ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎకరాకు రూ.7500 రైతుబంధును ఇస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తాజాగా వానాకాలం రైతుబంధును ఎగ్గొట్టేందుకు ప్రయత్నాలు చేస్తుందన్నారు. వారితో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, ఫాక్స్ చైర్మన్ జేజాల వెంకటేశ్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ పంగ మల్లేశం, మాజీ వైస్ ఎంపీపీ బెల్దే కృష్ణ, మాజీ సర్పంచ్ మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

● చిన్నకోడూరు: ఎన్నికల ముందు రైతులకు అండగా ఉంటానని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నిట్ట నిలువునా మోసం చేసిందని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మండలాధ్యక్షుడు శ్రీనివాస్ ఆరోపించారు. ప్రభుత్వం రైతు బంధు నిధుల విడుదలకు నిరాకరించిందని ఆరోపిస్తూ చిన్నకోడూరులో బీఆర్‌ఎస్ నాయకులు రైతులతో కలిసి నిరసన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, మాజీ సర్పంచ్ ఉమేష్‌చంద్ర, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.



చిన్నకోడూరు: సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



చినుకు పడితే.. అధ్వానం

మండల కేంద్రమైన కొండపాకలో ఓ ప్రైవేట్ స్కూల్ సమీపంలోని ప్రైవేట్ భవనంలో తెలంగాణ రాష్ట్ర వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్వహిస్తున్నారు. పాఠశాల భవనానికి వెళ్లడానికి చిన్న మట్టి రోడ్డు ఉంది. వర్షం పడగానే ఈ రోడంతా చిత్తడిగా మారుతున్నది. దీంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. విద్యార్థినులు ఇటీవల సెలవులు ముగియడంతో పాఠశాలకు తిరిగి వస్తున్నారు. రోడ్డు అంతా చిత్తడిగా ఉండడంతో వారు అవస్థలు పడుతున్నారు.

- కొండపాక

ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడలు



క్రీడలో పోటీ పడుతున్న విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): జనాభాలో ప్రపంచంలో మనమే ముందున్నప్పటికీ క్రీడల్లో వెనుకబడే ఉన్నామని, ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని క్రీడలను ప్రోత్సహించాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి సూచించారు. సిద్దిపేట ప్రభుత్వ పాఠశాలలో స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 68వ జిల్లాస్థాయి క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. సిద్దిపేట జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సౌందర్య మాట్లాడుతూ.. బహుమతులు, భోజన వసతి కల్పించిన వీఎమ్ఆర్ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు చెప్పారు.

ఆకునూరు గ్రామ కార్యదర్శి సస్పెన్షన్

చేర్యాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం ఆకునూరు మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి పులి బాలయ్యపై సస్పెండ్ వేటు పడింది. విధుల నిర్వహణలో బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తూ గ్రామంలో కొనసాగుతున్న అక్రమ ఇంటి నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల కలెక్టర్ మను చౌదరి కొరడా ఝుళిపించారు. ఈమేరకు శనివారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. కొద్దిరోజులక్రితం డీపీవో చార్జ్ మెమో జారీ చేశారు. కానీ పనితీరు మార్చుకోకపోవడంతో ఎట్టకేలకు క్రమశిక్షణా చర్యలకింద సస్పెన్షన్ వేటువేశారు.

'స్వచ్ఛమైన తాగునీరే ప్రభుత్వ లక్ష్యం'

వర్గల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, తాగునీరు పంపిణీలో మిషన్ భగీరథ సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దని మిషన్ భగిరథ డిప్యూటీ ఈఈ రాజు పేర్కొన్నారు. వర్గల్ ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ తాగునీటి సరఫరా సహాయకుల శిక్షణ సమావేశంలో శనివారం ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఖలీం తదితరులు ఉన్నారు.

కేంద్ర బీమాలను సద్వినియోగించుకోవాలి

● ఏపీజీవీబీ జగదేవ్‌పూర్ మేనేజర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

జగదేవ్‌పూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బీమా పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ జగదేవ్‌పూర్ మేనేజర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని బస్వాపూర్‌లో లీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

'క్రమశిక్షణ ఉంటేనే భవిష్యత్తు'

మర్కుక్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో క్రమశిక్షణ ఉంటేనే భవిష్యత్తని స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ బాలెడ్డి అన్నారు. మండలంలోని అంగడికిష్టాపూర్ పాఠశాల యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలకిషన్, యాజమాన్య కమిటీ వైస్ చైర్మన్ కనకయ్య, ఉపాధ్యాయులు సంతోషి, హారిక, చిన్నికృష్ణ ఉన్నారు.

ఆలయంలో చోరీ

గజ్వేల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని పాండవుల చెరువు కట్టపై ఉన్న కార్యసిద్ధి హనుమాన్ ఆలయంలో గుర్తుతెలియని దుండుగులు చొరబడి హుండీ పగులగొట్టి, ఆంప్లిఫయర్ ఎత్తుకువెళ్లినట్లు ఆలయ పూజారి సాయికృష్ణశర్మ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం ఆలయానికి వచ్చేసరికి తాళం పగులగొట్టి, హుండీ ఇతర వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయని తెలిపారు. హుండీలోని నగదును, అంప్లిఫయర్(స్పీకర్‌బాక్స్)ను అపహరించుకుని పోయినట్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పూజారి పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

దూళిమిట్ట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అక్రమంగా ఓ ఇంటిలో యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన వ్యక్తి మాలోత్ నాగేష్ నిల్వ ఉంచిన దాదాపు 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు తహసీల్దార్ మధుసూధన్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోహెడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) మండలంలోని తంగళ్లపల్లి మోయతుమ్మెద వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను శనివారం రాత్రి పట్టుకున్నామని. ఈ విషయమై ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'తెర'మరుగు

థియేటర్ల పరిస్థితి దయనీయం



ఒకప్పటి బాలాజీ టాకీస్

(ఐదో పేజీ తరువాయి) పరిస్థితి నుంచి క్యూబ్ సిస్టంతో సినిమాను ప్రేక్షకులకు చూపిస్తూ వస్తున్నాయి. డాల్బీ సిస్టం, 2కే, 4కే క్వాలిటీ మూవీస్‌ను ప్రజలకు పరిచయం చేశారు.

ఒక్కప్పటి హడావిడి లేదు

పట్టణంలోని ఐదు థియేటర్లకు ప్రస్తుతం రెండు టాకీస్‌లు మూతపడ్డాయి. విక్టరీ టాకీస్ చాలా ఏళ్లుగా మూతపడి ఉంటే, కొన్నేళ్లుగా శ్రీసీతారామంజనేయ థియేటర్‌ను ఓపెన్ చేయటం లేదు. థియేటర్‌లో ఒక ఆట నడవాలంటే క్యాంటీన్, సెక్యూరిటీ, గేట్‌మెన్, టార్చ్‌బాయ్స్, బుకింగ్ బాయ్స్, ప్రొజెక్టర్ ఆపరేటర్స్, మేనేజర్ అని 22 నుంచి 28 మంది పనిచేయాల్సి ఉంటుంది. ఇవి మూతపడటంతో అందులో పనిచేసిన వారు ఏదో పని వెతుక్కుని కాలం వెళ్లదీస్తున్నారు. ఈ నేపథ్యంలో మిగిలిన మూడు థియేటర్లు కూడా ఏషియన్‌తో కలిశాయి. ఏషియన్ వెంకటేశ్వర, ఏషియన్ బాలాజీ, ఏషియన్ శ్రీనివాసగా పేర్లు మారాయి. సౌకర్యాలు పెరిగాయి. కానీ ఒకప్పటిలా థియేటర్ల వద్ద హడావిడి కనిపించటం లేదు. ఎవరైనా స్టార్ హీరో సినిమా అయితే ఓ వారం రోజుల సందడి ఉంటుంది. తర్వాత మామూలే. ఒకప్పుడు టికెట్లు దొరకకపోతే సినిమా చూసేందుకు పైరవీలు చేయగా, ప్రస్తుతం ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుని దర్జాగా వెళుతున్నారు. గేట్ల వద్ద పడిగాపులు లాంటి, థియేటర్ లోనికి వెళ్లేందుకు తోసుకుకోవడం లాంటివి లేవు.

థియేటర్ల మీద కేబుల్, ఒటీటీ ప్రభావం

ఒకప్పుడు సినిమా అంటే వారానికో, నెలకో ఒకసారి లేదా మంచి సినిమా వచ్చినప్పుడో కుటుంబ సమేతంగా వెళ్లి చూసేవారు. కరోనా తర్వాత థియేటర్లకు వచ్చే వారి సంఖ్య విపరీతంగా పడిపోయింది. టాకీసుల భవితవ్యం అగమ్యగోచరంగా తయారైంది. కేబుల్ నెట్‌వర్క్, ఒటీటీల ప్రభావం సినిమాపైనా విపరీతంగా పడింది. కరోనా కాలంలో లాక్‌డౌన్ నుంచి ఒటీటీలు భూం మొదలైంది. ఇవి సరికొత్త వినోద వేదికలుగా మారాయి. కాలక్రమేణ చాలా మాధ్యమాలు అందుబాటులోకి రావటంతో టాకీస్‌లకు ప్రాధాన్యం తగ్గుతూ వస్తుంది. టీవీల్లో, మొబైల్స్‌లో ప్రేక్షకులు వారికి కావల్సిన వినోదాన్ని పొందుతున్నారు. అయితే సినిమా ప్రేమికులను థియేటర్లకు రప్పించాలనే పట్టుదలతో భారీతనంతో సినిమాలను తెరకెక్కిస్తున్నారు. కొంతమంది ప్రయత్నం ఫలించినా, కేవలం మూడు, నాలుగు వారాలే థియేటర్లు కళకళలాడుతున్నాయి. ఆ తర్వాత నాలుగు ఆటలకు సరిపడా జనం రావడం గగనంగా మారింది. చిన్న హీరో సినిమాలకైతే మొదటి ఆట నుంచి ప్రేక్షకులు కానరావడం లేదు.

జనం రావడం గగనమైపోయింది



ఒకప్పటిలా ప్రస్తుతం థియేటర్లు నడవటం లేదు. అప్పట్లో సినిమా విడుదలైతే ఒక జాతరను తలపించేది. టికెట్ల కోసం ఫోన్‌కాల్స్ వచ్చేవి. తినడానికి కూడా తీరిక ఉండేది కాదు. ప్రస్తుతం పాజిటివ్ టాక్ ఉన్న సినిమా అయితే పరవాలేదు కానీ మిగతా సినిమాలకు జనాలు రావటం గగనంగా మారింది. కొన్ని సందర్భాల్లో రోజుకు నాలుగు ఆటలు నడవటం లేదు. కొన్నిసార్లు నెలలో 120 ఆటలకు 20 నుంచి 30 ఆటలు మాత్రమే పడుతున్నాయి. ఒకవేళ ఏషియన్ తీసుకోకపోతే చాలా ఇబ్బందులు అయ్యేవి.

- లుక్క నాగయ్య, శ్రీనివాస థియేటర్ మేనేజర్

ఎడ్లబండ్లు కట్టుకొని పోయాం



మాది సిద్దిపేటకు 15 కిలోమీటర్లున్న వెలికట్ట గ్రామం. మా చిన్నప్పుడు సువర్ణ సుందరి, కీలుగుర్రం సినిమాలు చూడటానికి ఎడ్లబండ్లు కట్టుకొని పోయాం. ఒక సినిమాకు అయితే 15 కిలోమీటర్లు మా ఊరు నుంచి నడుచుకుంటూ సిద్దిపేటకు వచ్చి సినిమా చూసిన. కృష్ణ సినిమా సింహాసనం సినిమాలో ఆకాశంలో ఒక తార అనే పాట కోసమే మళ్లీ మళ్లీ వెళ్లిన వాళ్లు ఉన్నారు. ప్రస్తుతం కొత్త సినిమాలు టీవీల్లో, ఒటీటీల్లో వస్తున్నాయి. ఇంట్లోనే అందరం చూస్తున్నాం. మంచి సినిమా వస్తే థియేటర్‌కు వెళ్తున్నాం.

- బాపురావు, స్థానికుడు